
సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 18 । జనవరి । 2023



ఆడపిల్లలకు అండ..

కల్యాణమస్తు పథకం ఆడపిల్లలకు అండగా నిలుస్తోంది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. - 8లో



పండగ పూట విషాదం

పంటగ పూట విషాదం నెలకొంది. వేర్వేరు ప్రమాదాల్లో పలువురు మృతి చెందారు. - 8లో

27న ఆర్మీ క్యాంటీన్ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఈ నెల 27న ఇండియన్ ఆర్మీ క్యాంటీన్ ప్రారంభిస్తున్నట్లు మాజీ సైనికుల సంఘం పలాస-కాశీబుగ్గ జాయింట్ సెక్రటరీ అట్టాడ మాధవరావు తెలిపారు. హైదరాబాద్ ఆర్మీ యూనిట్ నుంచి జనరల్ ఆఫీస్ కమాండర్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని, పరిసర ప్రాంతాలకు చెందిన త్రిదళాలకు చెందిన కుటుంబాలకు ఇది శుభవార్త అని అన్నారు.






● సీటు కోసం ఫీటు

సంక్రాంతికి సొంతూళ్లకు వచ్చిన వారు మళ్లీ తిరుగు ప్రయాణమవుతున్నారు. ఈ సందర్భంగా పలాస రైల్వే స్టేషన్‌లో మంగళవారం ప్రయాణికుల రద్దీ కనిపించింది. సుదూర ప్రాంతాలకు చేరుకోవాల్సిన వారు లింకు రైళ్లతో విశాఖపట్నం చేరుకుంటున్నారు. మరికొందరు నేరుగా హైదరాబాద్, చెన్నై, అహ్మదాబాద్, బిలాయి, బెంగుళూరు, విజయవాడ, ఇతర ప్రాంతాలకు వెళ్లారు.

– కాశీబుగ్గ

న్యూస్‌రీల్

అదనపు గదుల నిర్మాణానికి స్థల పరిశీలన

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని లక్ష్మీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు వసతి సమస్య వెంటాడుతోంది. స్థానికంగా స్థలం అందుబాటులో లేకపోవడంతో ఆమదాలవలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో కనకాద్రి చెరువులో అదనపు తరగతి గదులు నిర్మాణానికి మున్సిపల్ అధికారులు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో మంగళవారం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ స్థల పరిశీలన చేశారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో మాట్లాడి పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో తహసీల్దారు ఎం.గణపతిరావు, మున్సిపల్ కమిషనర్ కె.అప్పలనాయుడు, టీపీఎస్ హెచ్.వి.సత్యనారాయణ, మండల సర్వేయర్ బి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూముల ఆక్రమణలపై విచారణ



పాతపట్నంలో భూమి నాలా కన్వర్షన్‌ను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

పాతపట్నం: పాతపట్నం మండలంలోని ప్రభుత్వ భూముల ఆక్రమణలపై టెక్కలి డివిజన్ సబ్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి మంగళవారం విచారణ నిర్వహించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ భూముల రికార్డులను ఆయన తహసీల్దార్ రవిచంద్ర, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, సర్వేయర్ రామగణపతిలతో కలిసి పరిశీలించారు. పాతపట్నం పట్టణంలో ప్రభుత్వ భూములను కాపాడాలని, అక్రమ లేఅవుట్‌లు ఉన్నాయని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి గతంలో ఫిర్యాదు చేశారని, దానికి సంబంధించిన వివరాలపై పలు రికార్డులను సబ్‌కలెక్టర్ పరిశీలించారు. 15 రోజుల్లో పూర్తి వివ రాలు పంపించాలని తహసీల్దార్‌ను కోరారు. అంతకు ముందు స్టువర్టుపురం, అంతరాబ, పాతపట్నం రెవెన్యూ పరిధిలోని ల్యాండ్ నాలా కన్వర్షన్‌లను సబ్‌కలెక్టర్ పరిశీలించారు.

'సమస్యలు పరిష్కరించాలి'



మాట్లాడుతున్న రంగనాథం

నరసన్నపేట: దేశ రక్షణలో భాగంగా పారామిలటరీలో వివిధ విభాగాల్లో పనిచేస్తున్న, ఉద్యోగ విరమణ పొందిన సైనికుల సమస్యల పరిష్కారానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కమాండెంట్ చింతాడ రంగనాథం అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం జిల్లా మాజీ పారామిలటరీ సంక్షేమ సంఘ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పారా మిలటరీ విభాగాల్లో సైనికులు చేస్తున్న కృషిని వివరించారు. దేశ రక్షణతో పాటు అంతర్ రాష్ట్రాల్లో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న పారామిలటరీ మాజీ సైనికుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కె.రామారావు, కె.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, బోర మాధవరావు మాట్లాడుతూ జిల్లాలో పలాస లాగానే మరో చోట కేంద్రీయ పోలీస్ కళ్యాణ్ బండార్ ఏర్పాటు చేయాలని, క్యాంటీన్ సదుపాయం కల్పించాలని, జిల్లాలో పారామిలటరీ సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం పారామిలటరీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రింట్ చేసిన 2023 క్యాలెండర్‌ను కమాండెంట్‌తో పాటు సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పారామిలటరీ సంక్షేమ సంఘం ప్రతినిధులు యాళ్ల అప్పలనాయుడు, సీపాన లక్ష్మణరావు, ఆట్ల సుమన్, ఎస్.రవి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు వెళ్లే రాష్ట్ర జట్టుకు శిక్షణ ప్రారంభం

కాశీబుగ్గ: పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో జాతీయస్థాయి సబ్ జూనియర్ టెన్నికాయిట్ పోటీల శిక్షణ శిబిరం మంగళవారం ప్రారంభమైంది. మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ నెల 21వరకు శిక్షణ కొనసాగుతుందని, ఈ నెల 22 నుంచి 26 వరకు అనకాపల్లిలో జాతీయ పోటీలు జరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో జాతీయ క్రీడాకారుడు ఎం.దామోదర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.తులసీరావు, రాష్ట్ర టెన్నీ కాయిట్ సంఘ ప్రధాన కార్యదర్శి, శిక్షకుడు పి.తవిటయ్య, పీడీ కె.హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

● నవోదయ..

సీటు కొట్టాలయ్యా!



జవహర్ నవోదయ విద్యాలయం

- కష్టపడితే సీటు సాధ్యం
- సీటు దొరికితే భవిత బంగారం

సరుబుజ్జిలి: గ్రామీణ ప్రాంతంలోని ప్రతిభ గల చిన్నారులను ఉన్నత స్థాయిలో నిలబెట్టడానికి, వారి భవితను బంగారం చేయడానికి ఉపకరించే మార్గం జవహర్ నవోదయ విద్యాలయం. ఈ బడుల్లో 6వ తరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నారు. ఇందుకోసం పిల్లలంతా పోటీ పడుతున్నారు. ఈ నెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఒక క్రమ పద్ధతిలో శిక్షణ ఇస్తే నవోదయలో సీటు కొట్టడం అసాధ్యమేమీ కాదు. సీటు దొరికితే ఆ బాలల భవిష్యత్ బంగారమైనట్టే. జిల్లాలో జిల్లాలో వెన్నెలవలస వద్ద జవహర్ నవోదయ విద్యాలయం ఉంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో 32 ఎకరాల విస్తీర్ణంలో 1988లో దీన్ని ప్రారంభించారు. ప్రస్తుతం భారతదేశంలో 28 రాష్ట్రాలు(తమిళనాడు మినహా), 7 కేంద్రపాలిత ప్రాంతాల్లో మొత్తం 660 జేఎన్‌వీ కేంద్రాలు విస్తరించి ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 15, తెలంగాణలో 9 కేంద్రాలు ఉన్నాయి.

సరుబుజ్జిలి విద్యాలయంలో బోధన చాలా బాగుంటుందని ప్రతీతి. వసతి, విద్యార్థుల్లో విషయ పరిజ్ఞానంతో పాటు నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, స్వచ్ఛమైన వాతావరణం వంటి ప్రత్యేకతలతో ఈ విద్యాలయం మంచి పేరు సంపాదించింది. ఈ కేంద్రంలో సీబీఎస్‌ఈ విధానంలో ప్రస్తుతం 6 నుంచి 12 తరగతుల వరకు 416 మంది విద్యార్థులు చదువుతున్నారు. మూడు పూటలా శుచి కరమైన పౌష్టికాహారంతో పాటు సేంద్రీయ విధానంలో తాము సాగు చేసిన కూరగాయలనే ఆహారంగా తీసుకోవడం ఇక్కడి విద్యార్థుల ప్రత్యేకత.

అర్హతలు ఇవే..

- ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతిలో చదువుతూ ఉండాలి.
- వరుసగా 3, 4, 5 తరగతులు గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభ్యాసం చేసినవారికి మొదటి ప్రాధాన్యం.
- జిల్లాకు 75శాతం సీట్లను గ్రామీణ ప్రాంతాల విద్యార్థులతో భర్తీ చేస్తారు. మిగిలిన సీట్లు పట్టణ ప్రాంతాలకు కేటాయిస్తారు.
- మొత్తం సీట్లలో 1/3 వంతు సీట్లు బాలికలకు కేటాయిస్తారు. ఎస్సీలకు 15శాతం, ఎస్టీలకు 7.5, దివ్యాంగులకు 3 శాతం సీట్లు రిజర్వ్ చేసి ఉంటాయి.

ఆటపాటల్లోనూ..

చదువుతో పాటు ఆటలు, పాటల్లో కూడా ఇక్కడి విద్యార్థులు దేశవ్యాప్తంగా జరిగిన వివిధ పోటీల్లో సత్తాచాటుతున్నారు. విశాలమైన మైదానం, ఇండోర్ ఆడిటోరియం, సంగీత తరగతులు, యోగా మానసిక ఉల్లాసాన్ని అందించడంతో పాటు జానపద, గ్రామీణ కళల్లో సైతం ప్రోత్సహిస్తారు. వెన్నెలవలసలోని విద్యార్థుల తప్పెటగుళ్ల బృందం జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చి ప్రత్యేక ఆదరణ పొందింది. దీనితో పాటు స్కౌట్స్, బ్యాండ్ సేవా కార్యక్రమాలతో పాటు కేంద్రంలో జరిగే వివిధ కార్యక్రమాల్లో తమదైన ప్రత్యేకతను చాటుకుంటున్నాయి.

చదివితే సీటు వస్తుంది



ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న జిల్లాలోని ప్రధాన కేంద్రాల్లో కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య జరుగుతుంది. కష్టపడి చదివితే సీటు వస్తుంది. అంతేకాని సీట్లు ఇప్పిస్తామని దళారీలు చెప్పిన మాట ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దు. చక్కగా విద్యార్థులు సిలబస్ ప్రిపేర్ కావాలి.

– ఎం.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ విద్యాలయం



ప్రవేశం ఎలా..?

నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశం ఉంటుంది. దీనికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో విద్యాలయానికి 80 సీట్లు కేటాయిస్తారు. ఒకసారి ప్రవేశం పొందిన విద్యార్థులు 12వ తరగతి(ఇంటర్)వరకు విద్యాభ్యాసం చేయవచ్చు. అలాగే 9వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో మిగులు సీట్లు ఏర్పడితే లేటరల్ విధానంలో విద్యాలయంలో ప్రవేశ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. ఇంటర్ పరీక్షలకు సీబీఎస్‌ఈ సిలబస్ ఉంటుంది..

పరీక్ష విధానం

పరీక్షలో మూడు విభాగాలు ఉంటాయి. 100 మార్కులకు విద్యార్థి చదువుతున్న మాధ్యమంలో ప్రశ్నపత్రం ఉంటుంది. మెంటల్ ఎబిలిటీ 50 మార్కులకు, అర్థమెటిక్ 25 మార్కులకు, లాంగ్వేజ్ టెస్ట్‌కు 25 మార్కులు కేటాయిస్తారు.

సైనికా సలామ్!



హరిపురం సీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న చిన్నారి. (ఇన్‌సెట్లో) కాపాడిన సైనికుడు దివాకర్

మందస: విహారానికి వచ్చి, సముద్రంలో కొట్టుకుపోతున్న ఇద్దరు చిన్నారులను కాపాడాడో సైనికుడు. సోంపేట మండలంలోని జీడిపుట్టుగ గ్రామానికి చెందిన కావ్య, మోక్షిత్ అనే పిల్లలిద్దరూ తల్లిదండ్రులతో భేతాళపురం పంచాయతీ రట్టి గ్రామం సమీపంలో గల తీరానికి మంగళవారం వచ్చారు. ఒడ్డున పిల్లలిద్దరూ ఆడుకుంటుండగా.. రాకాసి అల రావడంతో కొట్టుకుపోయారు. సిగలపుట్టుగ గ్రామానికి చెందిన ఆర్మీ ఉద్యోగి చీకటి దివాకర్ వారిని చూసి వెంటనే సముద్రంలోకి దూకి పిల్లలిద్దరినీ కాపాడారు. అప్పటికే చిన్నారులు నీరు తాగేయడంతో అక్కడి సర్పంచ్ మామిడి సింహాద్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పులారి కూర్మారావు, పితాంబరం సంఘటనా స్థలానికి చేరుకుని, హరిపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా డాక్టర్ తమ్మినాన పాపినాయుడు వైద్యం అందించారు. మెరుగైన వైద్యానికి శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. రిమ్స్‌లో చికిత్స పొందుతున్న పిల్లలిద్దరూ ప్రమాదం నుంచి బయటపడ్డారు. పిల్లలిద్దరి ప్రాణాలు కాపాడిన దివాకర్‌ను స్థానికులు అభినందించారు. రట్టి, లక్ష్మీపురం, భేతాళపురం, గంగువాడ, గెడ్డవూరు సముద్ర తీరాలకు నిత్యం సందర్శకులు వస్తుంటారని సర్పంచ్ సింహాద్రి తెలిపారు. ఈ ప్రాంతంలో హఠాత్తుగా రాకాసి అలలు వస్తుంటాయని, జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు.

జీడి మామిడి రైతుల ఆశలు ఆవిరి



పొగమంచు కారణంగా మాడిపోతున్న మామిడి పూత

ఎల్ఎన్ పేట: ఈ ఏడాది జీడి, మామిడి రైతుల ఆశలు ఆవిరైపోతున్నాయి. నాలుగు కాయలు కాసి ఆర్థికంగా ఆదుకుంటాయనుకున్న జీడి, మామిడి పూత పొగ మంచు దెబ్బకు మాడిపోతోంది. ఇప్పటికే పూత ఆలస్యమైంది. దీనికి తోడు ప్రకృతి సహకరించకపోవడంతో చెట్లు మోడువారిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూడు, నాలుగు రోజులుగా రాత్రి నుంచి తెల్లవారు 8గంటల వరకు కురుస్తున్న పొగమంచు కారణంగా తీరని నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని చోట్ల మామిడి, జీడి పూత ఆలస్యంగా వచ్చిందని, ఇప్పుడేమో వాతావరణంలో అధిక తేమ, విపరీతంగా కురుస్తున్న పొగమంచుతో పూత మాడిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కళ్ల ముందే పంట పాడైపోతున్నా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నామని విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆపత్కాలంలో అధికారులే సస్యరక్షణ చర్యలు సూచించి రైతులకు అవగాహన కల్పించాలని వారు కోరుతున్నారు. పాతపట్నం నియోజక వర్గంలో ఐదు మండలాల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడిందని తోటల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎల్ ఎన్ పేట మండలంలో దబ్బపాడు, సిద్ధాంతం, మి రియాపల్లి, లక్ష్మీనర్సుపేట, సుమంతాపురం, బసవరాజుపేట, పెద్దకోట, స్కాట్‌పేట, గొట్టిపల్లి, బొత్తాడసింగి, సరడాం, జోగివలస, కొత్త జోగివలస, కొత్తగూడ, కొత్తబాలేరు, జంబాడ, బొర్రంపేట, వలసపాడు, కరకవలస, మురగడలోవ తదితర ప్రాంతాల్లో సుమారు 150మంది రైతులకు చెందిన 500ఎకరాల్లో జీడి, మామిడి తోటలు ఉన్నాయని, తేనె, పొగమంచులు కారణంగా పూత మాడిపోయి రాలిపోతోందని ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మెరుగైన సేవలందించాలి: కలెక్టర్



లక్ష్ముడిపేట సచివాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

ఆమదాలవలస: సచివాలయ సేవలు మెరుగుపడాలని, ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని గ్రామ, వార్డు సచివాలయాల్లో పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ ఆదేశించారు. ఆయన మంగళవారం పట్టణంలోని లక్ష్ముడిపేట వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన కార్యక్రమం కోసం ప్రజలు శ్రమకోర్చి జిల్లా కేంద్రం వరకు రావాల్సిన అవసరం లేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం గ్రామ,వార్డు సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని గుర్తెరగాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాల కల్పనకు ఉద్దేశించిన కన్సిస్టెంట్ రిథమ్స్ తనిఖీలను చేస్తూ సమస్యలను యాప్ ద్వారా ఆన్‌లైన్ చేస్తూ సమస్యల పరిష్కారానికి ఆయా కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ బి.లక్ష్మినారాయణ, ఎంపీడీఓ ఎం.రేణుక, ఏఈ బి.సృజన, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రైవేటు వ్యాపారుల ద్వారా కొనుగోలు



రైతులతో మాట్లాడుతున్న మేనేజర్ జయంతి

ఇచ్ఛాపురం రూరల్: మిల్లులకు తరలించగా, ఇంకా మిగిలిపోయిన ధాన్యంను ప్రైవేటు వర్తకులను సంప్రదించి ప్రభుత్వం అందించిన మద్దతు ధరకే వారితో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లై మేనేజర్ ఎం.జయంతి అన్నారు. ఆమె మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులతో ధాన్యం కొనుగోలుపై ఆరా తీశారు. తేలుకుంచి, బెల్లుపడ రైతు భరోసా కేంద్రాలకు సంబంధించి టార్గెట్ పూర్తయినట్లు చెబుతున్నారని, రైతులను దృష్టిలో పెట్టుకొని 400 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తేలుకుంచి సర్పంచ్ పాతిర్ల రాజశేఖరరెడ్డి, నీలాపు ఢిల్లీ, పరపటి కోటిలు ఆమెను కోరారు. దీనిపై ఆమె స్పందిస్తూ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తానని, ఈ రెండు ఆర్బీకేల ద్వారా ధాన్యం కొనుగోలుకు మూడు రోజుల్లో ప్రయత్నిస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్బీలకు ధాన్యం ఇచ్చిన రైతుల ఖాతాల్లో సొమ్ము జమైందన్నారు. తహసీల్దార్ ఎం.లావణ్య, మండల సీనియర్ వ్యవసాయాధికారి పిరియా శ్రీదేవి, సీఎస్‌డీటీ సంతోష్‌కుమార్‌లు ఉన్నారు.

'రహదారి భద్రతా వారోత్సవాలు విజయవంతం'



ఆర్.కరాపాడు టోల్‌ప్లాజాలో ఉచిత కళ్లద్దాల్ని పంపిణీ చేస్తున్న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సు హరికృష్ణ

కవిటి: రహదారి భద్రతా వారోత్సవాలు విజయవంతమయ్యాయని, ప్రయాణికుల చొరవ వల్లే ఇది సాధ్యమైందని ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ నర్సు హరికృష్ణ అన్నారు. మండలంలోని ఆర్.కరాపాడు టోల్‌ప్లాజాలో మంగళవారం రోడ్డు భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రజలకు సురక్షిత ప్రయాణం, ప్రయాణికులకు క్షేమమైన రహదారి ప్రయాణ సేవలు ఏకకాలంలో అందించాలన్నది ప్రభుత్వ ఆశయమన్నారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు, ఆర్.కరాపాడు గ్రామ ప్రజలకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది ప్రాజెక్ట్ మేనేజర్ సెంథిల్‌కుమార్, వీవీకేఎస్ ప్రసాద్, ప్లాజా మేనేజర్లు జి.వెంకటరమణ, ఉమరుద్దీన్, కొప్పల రవి, జల్లు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

కష్టం అగ్నికి ఆహుతి



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన ట్రాక్టర్

మందస: మండలంలోని నర్సింగపురం పంచాయతీ దేవుపురంలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్, ధాన్యం, గడ్డి కుప్పలు, జీడిమొక్కలు దగ్ధమయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన గేదెల దుర్యోధన అనే రైతు పండిన వరిపంటను నూర్పుయంత్రంతో నూర్చుతున్నాడు. ధాన్యాన్ని మధ్య గ్రామానికి చెందిన కద్దాల చిన్నారావుకు చెందిన ట్రాక్టర్‌తో లోడు చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. క్షణాల్లోనే మంటలు వ్యాపించాయి. రైతులు, స్థానికులు ఎంత ప్రయత్నించినా, మంటలు అదుపులోకి రాలేదు. దీంతో ట్రాక్టర్, దుర్యోధనకు చెందిన ధాన్యం, పక్కనే ఉన్న సంతోష్‌కుమార్ అనే రైతు వరిచేను కుప్పలు, సోమేశ్వరరావు, హరిబందులకు చెందిన గడ్డికుప్పలు దగ్ధమయ్యాయి. జీడితోటలకు ఆనించి, కళ్లాలు ఉండడంతో మంటలకు జీడిమొక్కలు కూడా కాలిపోయాయి. ప్రమాద సమాచారాన్ని అగ్నిమాపక కేంద్రానికి అందించారు. అగ్నిమాపక యంత్రం వచ్చేసరికి నష్టం జరిగిపోయింది. సంవత్సరమంతా కష్టపడి పండించిన పంట కళ్లదుటే మంటలకు ఆహుతవ్వడంతో బాధిత రైతులు కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులు ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ఒక వ్యవసాయ భూమిని వ్యాపార పరంగా వాడాలంటే కచ్చితంగా ఆ భూమికి కన్వర్షన్ రుసుం చెల్లించి, రెవెన్యూ అధికారుల నుంచి అనుమతి లేఖ పొందాలి. కానీ ఇటీవల జిల్లాలో చాలా చోట్ల వ్యాపార సంస్థలు, భవనాలు, ఇతర కట్టడాలు ఎలాంటి కన్వర్షన్ రుసుం చెల్లించకుండానే నిర్మాణాలు కానిచ్చేస్తున్నాయి. కన్వర్షన్ ఫీజును ఆ భూమి మార్కెట్ విలువను బట్టి 5 శాతం వరకు చెల్లించాల్సి ఉంటుంది. ఈ ఫీజులు ఎక్కువగా ఉన్నందున ఎక్కువ మంది భూ యజమానులు ఈ ఫీజును చెల్లించకుండా తప్పించుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు కూడా లాలూచీ పడుతుండడంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ప్రధానంగా శ్రీకాకుళం నగరం, మండలంలోని చుట్టు పక్కల గల ఉన్న గ్రామాల్లో రోడ్డుకు దగ్గర ఉన్న వ్యవసాయ భూముల్లో కన్వర్షన్ ఫీజు చెల్లించకుండానే కట్టడాలు కడుతున్నారు. పెద్దపాడు, చాపురం, పాత్రుని వలస, రాగోలు, సింగుపురం రెవెన్యూ పరిధిలో ఇలాంటి కట్టడాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనిపై స్థానిక తహసీల్దార్ ఎన్.వెంకటరావు స్పందిస్తూ ఇవి తన దృష్టికి రాలేదని తెలిపారు. కన్వర్షన్ అనుమతులు లేని కట్టడాలు ఉంటే వాటిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఆడపిల్లలకు అండ కల్యాణమస్తు!



- అక్టోబర్ నుంచి అమల్లోకి వచ్చిన పథకం
- ఎస్సీ, ఎస్టీలకు రెట్టింపు ప్రోత్సాహకం
- కులాంతర వివాహాలకు ప్రోత్సాహకం
- ప్రారంభమైన దరఖాస్తుల స్వీకరణ

అర్హత.. నిబంధనలు..

- వధువుకు 18, వరుడికి 21 ఏళ్లు నిండాలి
- పదో తరగతి పాస్ కావాలి
- ఆడపిల్లకు మొదటి పెళ్లికి మాత్రమే నగదు ప్రోత్సాహం ఉంటుంది
- భర్త చనిపోయిన సందర్భంలో వితంతువుకు మినహాయింపు ఇస్తారు
- భార్య చనిపోయిన మగవారికి రెండో పెళ్లికి పథకం వర్తించదు
- వధూవరులు ఇద్దరూ రాష్ట్రానికి చెందినవారై ఉండాలి
- గ్రామీణ ప్రాంతంలో రూ.10 వేలు, పట్టణ ప్రాంతంలో రూ.12 వేలు నెలసరి ఆదాయం కలిగినవారే అర్హులు
- మూడెకరాల్లోపు మాగాణి, పదెకరాల మెట్ట, మాగాణి, మెట్ట కలిపి పది ఎకరాలున్న వారు అర్హులు

అనర్హులు వీరే..

- ✘ ప్రభుత్వ ఉద్యోగులు, ప్రభుత్వ పింఛన్ తీసుకుంటున్న కుటుంబాలకు చెందిన వారికి పథకం వర్తించదు. పారిశుధ్య కార్మిక కుటుంబాలకు మినహాయింపు ఉంటుంది
- ✘ నాలుగు చక్రాల వాహనం ఉన్నవారికి పథకం వర్తించదు. ట్యాక్సీలు, ఆటోలు, ట్రాక్టర్లు ఉన్నవారికి మినహాయింపు ఉంటుంది
- ✘ ఆదాయపు పన్ను చెల్లించేవారికి పథకం వర్తించదు
- ✘ పట్టణ ప్రాంతంలో వెయ్యి చదరపు అడుగులు మించిన నిర్మాణ ఆస్తి ఉన్నవారు అనర్హులు
- ✘ 2022 అక్టోబర్ ఒకటో తేదీ తరువాత వివాహం చేసుకున్న దంపతులను మాత్రమే పరిగణలోకి తీసుకుంటారు.
- ✘ పెళ్లి జరిగిన 60 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలి.

ఇచ్ఛాపురం రూరల్: మహిళలకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్న వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం మరో అడుగు ముందుకేసింది. ప్రజా సంకల్పయాత్రలో ప్రతిపక్షనేత హోదాలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీకి కట్టుబడుతూ 'వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా వంటి అద్భుతమైన పథకాన్ని ప్రవేశపెడుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2022 అక్టోబర్ ఒకటో తేదీ నుంచే ఈ పథకాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

గత ప్రభుత్వం కంటే..

ప్రస్తుత పరిస్థితుల్లో పెళ్లంటే లక్షలాది రూపాయలు చేతిలో ఉండాలి. అందులో ఆడపిల్ల పెళ్లంటే పేదింటి వారు భయపడతారు. అప్పు చేసి పెళ్లి జరిపించి బిడ్డను అత్తవారింటికి సాగనంపుతారు. పెళ్లి కోసం చేసిన అప్పును తీర్చడానికి చాలా కష్టపడుతుంటారు. అటువంటి పరిస్థితి ఎవరికీ రాకూడదనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'కల్యాణమస్తు'కు శ్రీకారం చుట్టారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 'చంద్రన్న పెళ్లి కానుక'పథకం కింద ఎస్సీలకు రూ.40 వేలు, ఎస్టీలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందిస్తే.. ఇప్పుడా మొత్తాన్ని సీఎం జగన్ భారీగా పెంచి నేనున్నానని భరోసా కల్పించారు.

ప్రోత్సాహకం ఇలా..

ఎస్సీ, ఎస్టీలు కులాంతర వివాహం చేసుకుంటే రూ.1.2 లక్షలు, విభిన్న ప్రతిభావంతులకు రూ.1.5 లక్షలు, ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, బీసీలకు రూ. 50 వేలు, కులాంతర వివాహాలు చేసుకుంటే బీసీలకు రూ.75 వేలు, ముస్లింలకు లక్ష రూపాయలను ప్రోత్సాహకంగా ఇవ్వనున్నారు.

దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం



ఇప్పటికే దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. అన్ని అర్హతలు ఉన్న వారు తగిన పత్రాలతో సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఎంపీడీవో, సెర్ప్ కార్యాలయాలను సంప్రదించవచ్చు.

– డి.విద్యాసాగర్, పీడీ, డీఆర్‌డీఏ

పేదింటి వారికి మేలైన పథకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, దివ్యాంగులు, మైనారిటీ వర్గాల పేదింటి వారికి కల్యాణమస్తు మేలైన పథకం. ఈ పథకానికి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. బాల్య వివాహాలు అరికట్టడంతో పాటు చదువును ప్రోత్సాహించడం, డ్రాపౌట్స్‌ను తగ్గించి అక్షరాస్యత శాతాన్ని పెంచడం కోసం వధూవరులు కచ్చితంగా ఉత్తీర్ణులై ఉండాలన్న నిబంధన విధించడం హర్షణీయం.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్

● జ్ఞాపకాల 'బడి'లో..!



వజ్రపుకొత్తూరు మండలం గోవిందపురం ఉన్నత పాఠశాల 1990 బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు మంగళవారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. తాము చదివిన తరగతి గదులకు వెళ్లి ఆనాటి జ్ఞాపకాలను ఒకరితో ఒకరు పంచుకున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తోటి మిత్రులకు సాయం చేయడంతో పాటు వారిలో ప్రతిభ కనబరిచిన పిల్లల చదువుకు తోడ్పాటుగా నిలవాలని తీర్మానించారు. అనంతరం అప్పటి ఉపాధ్యాయులను సత్కరించారు.

– వజ్రపుకొత్తూరు

సైనికుల సేవలు మరువలేనివి



బాతుపురంలో విశ్రాంత ఆర్మీజవాన్‌కు సన్మానం చేస్తున్న సభ్యులు



పెదవంకలో విశ్రాంత జవాన్లను సత్కరిస్తున్న సంఘ ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు రూరల్: దేశ రక్షణలో సైనికులు అందించే సేవలు మరువలేనివని వక్తలు కొనియాడారు. వజ్రపుకొత్తూరు మండలం బాతుపురంలో జై గణేష యువజన సంఘం ఆధ్వర్యంలో 8 మంది విశ్రాంత ఆర్మీ జవాన్లు, పోలీసులను మంగళవారం ఘనంగా సన్మానించారు. పెదవంకలో భారత సైనిక అసోసియేషన్ ఆధ్వర్యంలో ముగ్గురు జవాన్లను సత్కరించారు. ఈ సందర్భంగా దేశ సేవలో అమరులైన వీర జవాన్లకు ఘన నివాళులు అర్పించారు. సైన్యంలో చేరి దేశానికి సేవలు అందించడంలో ఉద్దాన యువత ముందంజలో ఉన్నారన్నారు. అనంతరం సంక్రాంతి సందర్భంగా నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతకు బహుమతులు అందజేశారు. క్రీడాకారులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జై గణేష యువజన సభ్యులు బత్తిని ప్రదీప్, గుజ్జు మనోహర్, రెయ్యి చాణక్య, బత్తిని ప్రశాంత్, డిఫెన్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో- ద్విచక్ర వాహనం ఢీ

- ఒకరి మృతి.. మరొకరికి గాయాలు



మృతిచెందిన బబ్బుల్లా

టెక్కలి రూరల్: సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. టెక్కలి పంచాయతీ గోపీనాథపురం గ్రామానికి చెందిన పండా బబ్బుల్లా (40) తన భార్య జగదీశ్వరి, కుమార్తెతో కలిసి సొంత ఆటోలో సంతబొమ్మాళి మండలం భావనపాడు వెళ్లి తిరిగి ఇంటికి బయలుదేరారు. సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామానికి చెందిన పేరాడ పవన్ అనే యువకుడు టెక్కలి నుంచి స్వగ్రామం వస్తుండగా ఇజ్జువరం సమీపంలో ఆటో, బైక్ పరస్పరం ఢీకొన్నాయి. ఈ ఘటనలో ఆటోడ్రైవర్ బబ్బుల్లా, బైక్ నడుపుతున్న పవన్ గాయపడ్డారు. క్షతగాత్రులను టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బబ్బుల్లా మృతిచెందాడు. పవన్‌ను మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. టెక్కలి ఎస్ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి సంతబొమ్మాళి పోలీసులకు సమాచారం అందించారు. సంతబొమ్మాళి పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టాఫ్‌నర్సు పోస్టుల ఎంపికలో గందరగోళం


- తమకు అన్యాయం జరిగిందని నిరుద్యోగ నర్సుల ఆందోళన
- వెయిటేజ్ మార్కులు కలపలేదని తాత్కాలిక ఉద్యోగ నర్సుల నిరసన
- నేటికి కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ వాయిదా

మహారాణిపేట(విశాఖ దక్షిణ): స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీ కోసం ప్రకటించిన జాబితాపై గందరగోళం నెలకొంది. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ నిరుద్యోగ నర్సులు విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. పోస్టుల్లో తమకు వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు నిరసన తెలిపారు. మొత్తం పోస్టులకు అభ్యర్థులను ప్రకటించకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం జరగాల్సిన కౌన్సెలింగ్, పోస్టింగ్ ఆర్డర్స్ జారీ బుధవారానికి వాయిదా పడింది.

స్టాఫ్‌నర్స్ పోస్టుల కోసం అభ్యర్థుల ఎంపిక జాబితాను శనివారం వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర కమిషనర్ విడుదల చేసింది. ఈ నెల 17, 18వ తేదీల్లో కౌన్సెలింగ్ చేపట్టి.. నియామక పత్రాల జారీ చేయాలని నిర్ణయించింది. పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం వంటి నిర్ణయాలు రావడంతో వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో తుది మెరుగులు దిద్ది జాబితాను విడుదల చేశారు. ఈ జాబితాపై పలువురు పెదవి విరుస్తున్నారు. ఎంపిక జాబితాలో తమకు అన్యాయం జరిగిందంటూ కొంత మంది నిరుద్యోగ నర్సులు, తమకు వెయిటేజ్ మార్కులు కలపలేదంటూ తాత్కాలిక ఉద్యోగ నర్సులు మంగళవారం కార్యాలయానికి చేరుకుని ఆందోళన చేశారు.

10,659 దరఖాస్తుల స్వీకరణ

ఉత్తరాంధ్ర పరిధిలోని ఆరు జిల్లాల్లో స్టాఫ్ నర్సుల పోస్టులకు సంబంధించి వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ డైరెక్టర్(ఆర్డీ) కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరించారు. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో మొత్తం 10,659 దరఖాస్తులు వచ్చాయి. ఈ దరఖాస్తులను ఆర్డీ డాక్టర్ ఉమా సుందరి ఆధ్వర్యంలో సిబ్బంది పరిశీలించి.. మొత్తం 163 పోస్టులకు గానూ 8,659 మందిని అర్హులుగా గుర్తించారు. గత నెల 24వ తేదీ అర్ధరాత్రి తర్వాత వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం ప్రొవిజినల్ జాబితా విడుదల చేసి అభ్యంతరాలు స్వీకరించింది. మొత్తం నాలుగు వేలకు పైగా అభ్యంతరాలు రాగా.. వీటిని పరిశీలించి మెరిట్ జాబితాలో కలిపారు. ఆ తర్వాత పోస్టుల సంఖ్య పెరగడం, కోవిడ్ సమయంలో పనిచేసిన వారికి అదనపు మార్కులు కలపడం, జీవో నంబర్ 301 ప్రకారం వెయిటేజ్ మార్కులు ఇవ్వాలని వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. దీంతో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారికి వెయిటేజ్ మార్కులు కలిపి జాబితాను సిద్ధం చేశారు. ఈ జాబితాపైనే గందరగోళం ఏర్పడింది.



నర్సుల కన్నీరుమున్నీరు

'అనకాపల్లి ఆస్పత్రిలో నాలుగున్నరేళ్ల పాటు పనిచేశా. ప్రస్తుతం చీడికాడ పీహెచ్‌సీలో తాత్కాలికంగా పనిచేస్తున్నప్పటికీ నాకు వెయిటేజ్ మార్కులు కలపలేదు. 8 నెలల గర్భిణిగా విధులు నిర్వర్తించాను. ఏడాది పాటు జీతం కూడా ఇవ్వలేదు.' అని ఓ నర్సు కన్నీరు మున్నీరయ్యారు. ఇప్పుడు ఈ పోస్టులో అవకాశం ఇవ్వలేదని.. తనకు తీవ్ర అన్యాయం జరగడంతో స్పందనలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కరోనా కాలంలో పనిచేసిన అనేక మందికి వెయిటేజ్ మార్కులు కలపలేదని, దాని వల్ల తుది జాబితాలో పేరు లేవని పలువురు నర్సులు వాపోయారు.

సర్టిఫికెట్ల పరిశీలన

మరోవైపు స్టాఫ్ నర్సు పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల ఒరిజినల్ సర్టిఫికెట్ల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించడానికి వైద్య ఆరోగ్యశాఖప్రాంతీయ అధికారులు సన్నాహాలు చేశారు. చాలా మంది తమకు అన్యాయం జరిగిందంటూ రావడంతో కౌన్సెలింగ్, నియామక పత్రాల జారీ బుధవారానికి వాయిదా వేశారు. కొందరి సర్టిఫికెట్ల పరిశీలన మాత్రమే జరిగింది.

నేడు కూడా కౌన్సెలింగ్

బుధవారం కూడా సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. మంగళవారం 100 మందికి చెందిన సర్టిఫికెట్లను పరిశీలించాం. బుధవారం మధ్యాహ్నానికి ప్రక్రియ పూర్తవుతుంది. సాయంత్రం నియామక పత్రాలు, పోస్టింగులు ఇస్తాం. ఎవరికైనా వెయిటేజ్ మార్కులు కలవకపోతే తక్షణమే సంప్రదించాలి. అర్హులందరికీ న్యాయం జరుగుతుంది.

– డాక్టర్ ఉమా సుందరి, వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్

ఏడు పోస్టులు పెండింగ్

వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 108 పోస్టులు, వైద్య విధాన పరిషత్ పరిధిలో 47 పోస్టుల భర్తీకి తొలుత నోటిఫికేషన్ విడుదలైంది. ఆ తర్వాత విమ్స్‌లో 24 పోస్టులు కలిశాయి. దీంతో మొత్తం 179 పోస్టులకు గానూ 172 మందితోనే జాబితా ప్రకటించారు. ఏడు పోస్టుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. దీనిపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో 108 పోస్టుల్లో రెండు పోస్టులు స్పోర్ట్స్ అభ్యర్థులకు, రెండు పోస్టులు అంధులు, మానసిక వికలాంగులకు, విమ్స్‌లో రెండు పోస్టులు దివ్యాంగులకు కేటాయించినట్టు ఆర్డీ డాక్టర్ ఉమా సుందరి తెలిపారు.

పండగ పూట విషాదం

- వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి



మృతిచెందిన అప్పలస్వామి



మృతిచెందిన రాజారావు



మోహనరావు (ఫైల్)

కోటబొమ్మాళి: మండలంలో జర్జంగి వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పోలాకి మండలం కింజరాపువానిపేటకు చెందిన బర్ల అప్పలస్వామి(30) మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంక్రాంతి పండగకు అప్పలస్వామి తన అత్తవారిల్లు కోటబొమ్మాళి మండలం ఎలమంచిలి వెళ్లేందుకు బైక్‌పై బయలుదేరి జర్జంగి వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో అప్పలస్వామి తలకు తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందాడు. అప్పలస్వామికి భార్య రఘుపతిలక్ష్మీ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్‌ఖాదర్ బాషా తెలిపారు.

పురుగుల మందు తాగి..

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. రెండో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ పప్పల శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం .. సీపన్నాయుడుపేటలో నివాసముంటున్న గరుగుబిల్లి రాజారావు (45)కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి స్వగ్రామం పొందూరు మండలం పిల్లలవలస. కొంతకాలంగా సీపన్నాయుడుపేటలోనే ఉంటున్నారు. తాపీమేస్త్రీగా పనిచేస్తున్న రాజారావు వెన్నెముక వ్యాధి, కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నాడు. ఆర్థిక ఇబ్బందులు కూడా తోడవ్వడంతో ఈ నెల 12న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రిలో చేర్పించారు. సోమవారం అర్ధరాత్రి చికిత్స పొందుతూ మృతిచెందాడు. రాజారావు కుమారుడు దిలీప్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గుండెపోటుతో ఆర్మీజవాన్..

సరుబుజ్జిలి: పురుషోత్తపురం గ్రామానికి చెందిన ఆర్మీజవాన్ పూజారి మోహనరావు(39) గుండెపోటుతో రాజస్థాన్‌లో మంగళవారం మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇప్పటి వరకు సికింద్రాబాద్‌లో విధులు నిర్వహించగా, శిక్షణ నిమిత్తం ఇటీవల రాజస్థాన్ వెళ్లినట్లు చెప్పారు. ఎప్పటిలాగే శిక్షణ నిమిత్తం గ్రౌండ్‌లో ఉండగా గుండెపోటు రావడంతో అక్కడే కుప్పకూలి మృతిచెందినట్లు ఆర్మీ కార్యాలయం నుంచి సమాచారం వచ్చినట్లు వెల్లడించారు. ఈయనకు భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు ఉన్నారు.

సీఎం పేరిట ప్రత్యేక పూజలు



కొబ్బరికాయలు కొట్టి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- 108 కొబ్బరికాయలను కొట్టిన ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ ఆలయంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేరుమీద పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఆలయంలో 108 కొబ్బరికాయలను కొట్టారు. సీఎం జగన్‌తోపాటు రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని పూజలు చేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, ఆలయ చైర్మన్ నూలు ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎనుగుతల సూర్యం, కె.లక్ష్మీనారాయణ, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కార్లకు నిప్పంటించిన దుండగులు

- సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు



కాలిబూడిదైన కార్లు ఇవే

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని జగన్నాథ దాబా సమీపంలోని కారు షెడ్ వద్ద మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రెండు కార్లకు నిప్పంటించి పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే.. పలాస జగన్నాథ దాబా పక్కన ముకుంద కార్‌షెడ్ వద్ద ఉంది. మరమ్మత్తుల నిమిత్తం రెండు కార్లను షెడ్డు బయట ఉంచి షెడ్ యజమాని వెళ్లిపోయారు. మంగళవారం రాత్రి 11.21 గంటల సమయంలో ఇద్దరు యువకులు ముఖాలకు ముసుగేసుకుని వచ్చి కార్లకు నిప్పంటించారు. ఒక్కసారిగా మంటల చెలరేగడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకుని కార్‌షెడ్ యజమాని ముకుంద కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసినప్పటికి ప్రయోజనం లేకపోయింది. కాగా, యువకులు కార్లకు నిప్పంటించిన ఘటన అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయ్యింది. ఈ ఫుటేజీలను శ్రీకాకుళం క్రైం కార్యాలయానికి పంపించి పరిశీలన చేస్తున్నారు. కాశీబుగ్గ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు కార్ల విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని భావిస్తున్నారు.

క్లుప్తంగా

బొల్లినేని మెడిస్కిల్స్‌లో ఉచిత శిక్షణ, ఉద్యోగాల కల్పన

శ్రీకాకుళం రూరల్: మండలంలోని రాగోలులో గల జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్‌లో బయాలజీ సైన్స్, సోషియాలజీ, సోషల్ సైన్సు, పబ్లిక్ హెల్త్‌లో డిగ్రీ లేదా పీజీ పూర్తి చేసిన విద్యార్థులకు ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు బొల్లినేని మెడిస్కిల్స్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ ఎచ్చెర్లలోని ఏపీఎస్‌ఎస్‌డీసీ, సీడాప్ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలో గల డీటీడీసీలో 4 నెలలు నిర్వహించనున్నట్లు చెప్పారు. శిక్షణకు హాజరైన వారికి ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ పూర్తయిన వారికి కార్పొరేట్, ఇతర ఆస్పత్రుల్లో ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు. 20–30 మధ్య వయసులో ఉన్న వారు అర్హులని, వివరాల కోసం 76809 45357, 79950 13422 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డాక్యుమెంట్లు దగ్ధం



కాలిపోయిన దుకాణం

రణస్థలం: మండల కేంద్రంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో దస్తావేజు లేఖర్లు భద్రపరుచుకునే డాక్యుమెంట్ల దుకాణం అగ్నికి ఆహుతైంది. ఈ సందర్భంగా లేఖర్లు మాట్లాడుతూ మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి దుకాణం కాలిపోయి ఉందని, గుర్తు తెలియని వ్యక్తులు పక్కన చెత్తపోగేసి కాల్చినట్లు ఉందని, వాటితో పాటు పక్కనే ఉన్న దుకాణం కాలిపోయి ఉండవచ్చని చెప్పారు. విలువైన పత్రాలు బూడిదైపోయాయని తెలిపారు.

చింతామణి అమ్మవారికి బంగారు కానుక



అమ్మవారికి బంగారు కానుక బహూకరిస్తున్న పాపారావు దంపతులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్యదైవం కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి ప్రవాస భారతీయుడు బుర్రకాయల పాపారావు రాజేశ్వరి దంపతులు రూ.1.10 లక్షల విలువైన బంగారు కానుకను బహూకరించడం అభినందనీయమని కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు అన్నారు. మంగళవారం ఆలయంలో జరిగిన కార్యక్రమంలో రెండు తులాల ఆభరణాన్ని అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులర బెందాళం వెంకటేశ్వరరావు, పాండవ చంద్రశేఖర్, పినింటి జయరావు, ఆరంగి త్రివిక్రమరావు, పినింటి జయరావు, పొల్లాయి లక్ష్మణమూర్తి, పొల్లాయి రాము, గిరి తదితరులు పాల్గొన్నారు. కాగా, సంక్రాంతి పండుగ నేపథ్యంలో అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. బొరివంకలోని కాళీమాత ఆలయం, బల్లిపుటుగ, కుసుంపురంలో సింధుపురాణి అమ్మవారి ఆలయాలు సైతం భక్తులతో రద్దీగా కనిపించాయి.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225